# నాటక శిల్పం

**- గంగాధర్ వీర్ల**

'కావ్యేషు నాటకం రమ్యం' ఇది జగమెరిగిన మాట. నాటకకళను అభివర్ణించడానికి ఇంతకంటే సమంజసమైన మాట ఉండకపోవచ్చు. నాట్యం, సంగీతం, సాహిత్యం, అభినయం... సర్వకళల సమాహారాన్ని ఒకే భూమికపై ఆవిష్కరించగలిగే శక్తి నాటకానికుంది. శతాబ్దాలకు పూర్వమే ప్రపంచ వీధుల్లో నాటక కళ పుట్టింది. తెలుగు వాకిట కూడా నాటకరంగ ఆవిర్భావానికి వందేళ్ళకు పైగా చరిత్ర ఉంది. నాటకం అంటే కేవలం ఒక కళ మాత్రమే కాదు. విద్య, పరిశోధన, అధ్యయనం, ప్రాపంచిక గమనంలో ఆధునిక పోకడల్ని విశ్లేషించడం, సమన్వయం చేసుకోవడం ఇలా ఎన్నో శాఖల సంగమంగా నాటకం ఎదుగుతోంది. టీవీ, సినిమా, రేడియో వంటి మాధ్యమాలు మరింత శక్తిని పుంజుకుంటున్న క్రమంలో నాటక కళను సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి తెలుగులో 'నాటకశిల్పం' రావడం ముదావహమైన విషయం. కొన్ని విషయాలు కొందరు చెప్తేనే బాగుంటుంది. నాటకం గురించి ఆచార్య మొదలి నాగభూషణశర్మ చెబితేనే బాగుంటుంది అని చెప్పడానికి ఏమాత్రం సంకోచించక్కర్లేదు. తెలుగు నాటక రంగంలో ప్రయోగిక అంశాలతోపాటు నాటకకళపై ఎప్పటికప్పుడు శాస్త్రీయ దృక్పథాన్ని బలపరుస్తూ, అవగాహన కలిగిస్తూ నాటకరంగానికి చెందిన వ్యక్తులతో నడిచొచ్చే శర్మాజీని తెలిసినవారంతా నాటకరంగ లైబ్రరీగా అభివర్ణిస్తుంటారు.

నాటక రంగానికి సంబంధించి పాశ్చాత్య నేపథ్యాన్ని కలుపుకుంటూనే నాటక కళ శిల్పాన్ని, చాతుర్యతను సవివరంగా మొదలి పొందుపరిచారు. నాటకం, దాని రూపురేఖలు, ఆధారిత సాహిత్య ప్రక్రియలు, దీనిలో ఇమిడివున్న భారతీయ, పాశ్చాత్య సిద్ధాంతాలు ఒక క్రమపద్ధతిలో వివరించారు. నాటకాభిమానులు మొదలుకుని, విమర్శకులు, పరిశోధకులు, విద్యార్థులు... అందరికీ ప్రయోజనాన్ని ఇచ్చే పుస్తకమిది.

## ఒక ఉత్తరం

**ఆచార్య శ్రీ మొదలి నాగభూషణశర్మగారికి,**

నమస్కారము.

మీ 'నాటకశిల్పం' గ్రంథం - నాటకాభిమానులకు భగవద్గీత. సమగ్రంగా, ప్రామాణికంగా - మీ రచన సాగింది. తరతరాల నాటకప్రియులు, అపూరుపంగా దాచుకుని, పరిశీలన, విశ్లేషణ, పునశ్చరణకు ఉపయోగించతగ్గ ఆధునిక నాట్యశాస్త్రం. ధన్యవాదములతో.....

భవదీయ

**ఎన్. తారకరామారావు**